# తులసీదళము

శ్రీనివాసమూర్తిసేవ చేసినేను సన్నుతించి
మానసమున తులసిదళము మహిమ జెప్పెద
తులసిదళము మహిమ మంచి మోక్షమునకు మార్గమనుచు
బదులు జెప్పగాను వింటిపుణ్యమనుచును
బాగుమీర ద్వారకాపురంబులోన కృష్ణమూర్తి
రాజ్యమేలె నతడులోకనాథు డనుచును
ఒక్కనాడు నారదుండు వచ్చి కృష్ణసేవలంది
తిరుగజొచ్చె పురములోన ధీరుడగుచును
ద్వారకాపురంబులోన నెల్లతిరిగిచూచితాను
నొక్కపూహచేసినాడు పూరకుండక
సత్యభామ నగరికేగి అచట పూజలంది తాను
భక్తిజూచితలాపెట్టె వ్రతమునొక్కటీ
తులసిపూజజేసితేను తోయజాక్షి నీకువేగ
వైకుంఠపదవివచ్చు వారిజాక్షిరో
యింతకన్న నెక్కువైన వ్రతమునాకు దెల్పవయ్యా
ముందుజన్మలోన కృష్ణుడు మగడుకౌటకూ
అంతకన్న నెక్కువైన వ్రతము నొక్కటుండెగాని
చెప్పగాను జేయవేమొ సిగ్గుచేతనూ
గోపికామనోహరుండు గోపాలకృష్ణమూర్తి
భర్తనా కమరియుండ సిగ్గులేటికి
పతినిదాన మిచ్చినట్టి వారిపుణ్య మేమొగాని
వైకుంఠ వాసులైన నణగివుందురూ
శ్రీలక్ష్మి పార్వతమ్మ యింద్రాణి మొదలుగాను
దేవిశక్తులైనగాని జడియుచుందురూ
యింతకన్న నెక్కువైనదానమున్న దెల్పుమనగ
దీనిమించి నట్టివ్రతము నేనుయెరుగనూ
అపుడువెళ్ళి సత్యభామ సఖులజూచి యిట్లుబలికె

వ్రతము సేయదలచినా నొక్కరీతిని
నానాథు కృష్ణమూర్తి యెచటనున్న గాని మీరు
యిచటదెచ్చి నిల్పరమ్మ వేడ్కమీరగా
పన్నీరుజలకమార్చి పట్టువస్త్రంబుగట్టి
ఫలపుష్పమాదిగాను పళ్లెరంబులూ
అనుచు జెప్ప నారదుణ్ణి జూచితానొక్కటనియె
మౌనినాథ నాదుమనవి చిత్తగింపుమీ
పతిని దాన మిచ్చినట్టి వనితబ్రతుకుదారి జెప్పు
మనగ తపసినవ్వి యిట్లు పలుకబోచ్చెనూ
దానమిచ్చినట్టి భర్తతిరిగి రానొక్కదారి
నతని యెత్తుకనక మిస్తెతిరిగి యిస్తురూ
ధర్మ శాస్త్రమందు నొప్పియున్నదనుచు జెప్పగాను
సమ్మతించి వేగజేయ సాహసించెనూ
పతినిదెచ్చి పూజజేసి తపసిజూడగాను మంచి
భూసురుల పిలువనంపె దానమివ్వగా
భూసురులు కోట్లకొలది వచ్చియున్న వారెగాని
దానమందరెవరు నతడు దైవమనుచునూ
సత్యభామ చిన్నబోయి నారదుణ్ణిచూచి తాను
యేమయ్యా తపసిగారు యిట్టివింతలూ
అపుడునతడు దానమంది కోట్లకొలదిగాను ధనము
దక్షిణనుచు విప్రులకు పంచిపెట్టెనూ
యిది యేమివ్రతము యనుచు కృష్ణమూర్తి బలుకగాను
సత్యభామ జెప్పసాగె స్వామితోడనూ
నారదుండు వచ్చినన్ను వ్రతము జేయుమనునుదెల్ప
ముఖ్యమయినవ్రతము నాకు చెప్పమంటిని
పతినిదాన మిచ్చినట్టి వనితలకును జెప్పరాని
పదవిదొరుకుననుచు దెల్ప నటులజేసితీ
యింతకన్న నెక్కువైన పూజనేను జేయలేదు
నిందసేయవద్దు నాకు నీవు వైరివా
యేమయ్యా నారదుండ కృష్ణునెత్తు కనకమిస్తు
నాదుపతిని నాకుయిమ్ము వేగమందునా

అపుడు నారదుండు నవ్వి తులయునొక్క దానితెచ్చి
తూచుకనకమనుచు జెప్పె సత్యభామకూ
కోటలోను వున్నవన్ని వరహాలు మొహరీలు
అన్నివేసి తూచినాను మొగ్గదాయెనూ
యింటనున్న పలకసర్లుపతకమూలు దెచ్చినాను
తూగడాయె కృష్ణమూర్తి చోద్యమందగా
యిరుగుపొరుగు సొమ్ములన్ని దెచ్చివేసి చూడగాను
మొగ్గదాయె దైవమాయ తెలియదెవరికీ
తనకు సత్రజిత్తుడిచ్చినట్టి గొప్పముత్యసరులు
తెచ్చివేసిచూడగాను తూగదాయెను
కృష్ణమూర్తి యింద్రపదవి చూడబోయి తెచ్చినట్టి
కనకమంతవేసెగాని తూగదాయెనూ
నరకసురుని సంహరించి దెచ్చినట్టి మూలధనము
నన్నివేసి చూచెగాని మొగ్గదాయెనూ
తుదకు అష్టభార్యలెల్ల దాచుకున్న ధనముదెచ్చి
మంత్రివరుల సొమ్ములన్ని వేగదెచ్చిరీ
పదహారువేల గోపికాకాంతలందరొచ్చి
తమకు భర్త పోవునంచు సొమ్ములిచ్చిరీ
ద్వారకాపురంబులోన కాపురంబు జేసినట్టి
ప్రజలు జూచి చోద్యమందె వింతజూచియు
తమకు రాజవుండకోరి తమతమ యిండ్లనుండు
కనకమంత దెచ్చినాను తూగదాయెనూ
కొండపొడవు ధనములెల్ల కుప్పబోసి తూచగాను
తూగడాయె కృష్ణమూర్తి దుడుకుచేతనూ
వెతకివెతకి ధనములెల్ల దెచ్చివేసినానుగాని
భర్తతూగడాయెననుచు చింతనొందెనూ
సత్యభామ చింతనొంది సఖులజూచి యిట్లుబలికె
యేమిసేతు నెటులదెత్తు నాదుభర్తనూ
నారదుండుజెప్పగాను మంచివ్రతము దొరకెననుచు
పూని నేనుచేసితిని పతినిదానమూ
చేసినందుకేమి చింత చెలియలార మీరుకొంత

ధనముతెచ్చితేను వచ్చునాదు కృష్ణుడూ
అపుడు కృష్ణమూర్తిచూచి యింత సాహసంబు నీకు
యెవరుచెప్పినారు నన్ను దానమివ్వనూ
యింత ధనముతెచ్చినావు యింపుగాను చూచినావు
నన్ను గెలువజూడ నీకు న్యాయమౌనటే
మించిచేసి నట్టిపనికి చింతనొందనేమిలాభ
మనుచు కృష్ణమూర్తి బలికె సత్యభామకూ
పట్టంపుదేవియయిన భామ రుక్మిణీదేవి
చెంతజేరియిట్లు జెప్పుమనెను వేడ్కమీరగా
నీకుయిట్టి దుఃఖమేల నిజముగాను నీవువెళ్ళి
శరణునొంది చెప్పుమనగ చింతతోడనూ
వెలదులార యింత కాలమందునుంచి మాటలేక
యున్న రుక్మిణీచెంతనెట్లు బోదునూ
పోవనేమి లాభమనుచుజెప్పి తనదు మనసులోన
నొక్క వూహజేసినది సత్యభామయు
నోటి పంతములవల్ల మాటలేకపోయెగాని
ప్రాలుతప్పనలవిగాదు అజునికయిననూ
అనుచున్నాయి రుక్మిణిని చేరివేగ మ్రొక్కగాను
దీవించి చేరదీసి యిటులనడిగెనూ
యెన్నడును రానిదాన విపుడువచ్చినట్టి కార్య
మేమొ దెల్పుమనుచు బల్కెవేడ్కమీరగా
మాటవినియు సంతసించి సత్యభామబల్కెనపుడు
పెద్దదానవనుచు మిమ్ముజూడవచ్చితి
వొక్కనాడు నారదుండు వచ్చినన్ను వ్రతముజేయు
మనుచుదెల్పగాను జేస్తి పతినిదానమూ
నతనియెత్తు కనకమిచ్చినపుడు మనముపుచ్చుకోగ
వ్రతముపూర్తి జేస్తినమ్మ పూరకుండక
కొండపొడవు కనకరాశి గొప్పముత్యసరములెల్ల
నిండుగాను వేసినాను తూగడాయెను
నాకువల్ల కాకపోయి సిగ్గుచేత మోమువంచి
మిమ్ముచేరి మ్రొక్కినాను చిన్నదానను

నావద్ద ధనములే దెన్నడయినగాని విభు
డెంత సొమ్ము తెచ్చినాను నాకుయిచ్చెనా
తనకుసత్రజిత్తుడిచ్చినట్టి గొప్పముత్యసరులు
విభుడు నీకు దాచియిచ్చె వేడ్కతోడనూ
యింద్రపదవి బోయిచూచి తెచ్చినట్టి కనక మెల్ల
యింపుగాను నీకుయిచ్చె కృష్ణమూర్తియూ
నరకసురుని సంహారించి తెచ్చినా మూలధనము
నీయింటదాచినాడు మోదమందియూ
పెండ్లినాడు కట్టినట్టి పాలపూసలే గాని
యితరసొమ్ము లేవియునునాకు లేవుగా
యశోదతనయుడయ్యు దానమివ్వ నీకుబుద్ధి
యెవరుజెప్పినా రతని తంద్రియుండగా
పట్టంపుదేవినయిన నేను యిచటనుండగాను
నీకుయింత సాహసంబె వేశ్యకాంతరో
అయిననాకు గలిగినట్టి ముఖ్యమైన వస్తువుండె
యిచ్చెదాను వేగపోయి వేసిచూడుమా
తులసిదళము చేతవిభుడు రాకయున్న నేనువచ్చి
తెస్తుననుచుబల్కెనపుడు భామరుక్మిణీ
ఆమాట వినియు సత్యభామ నిటులబల్క జొచ్చె
తులసిదళము నేనుపట్ట నలిగిపోవునూ
మృదువైన తులసిదళము మీరుదెచ్చి తూచవలెను
ననుచుజెప్ప రుక్మిణిదేవి నవ్వసాగెనూ
అపుడులేచి పన్నీట జలకమాడె వేగమున
తులసిదేవి అరుగునలికి మ్రుగ్గుబెట్టెనూ
ధూపదీప నైవేద్యపూల పూజమొదలుగాను
జరిపి యిటుల మ్రొక్కసాగె తులసిదేవిని
ఒక్కదళముచేత నెత్తి గోపాల కృష్ణమూర్తి
మాకువచ్చినట్టుగానె మీదుకీర్తిని
యెల్లలోకంబులను వినికిజేసి వేగమున
విభునితోడి సౌఖ్యమంది వేగనుందుము
అనుచునొక్కదళము త్రుంచి హస్తమున భద్రపరచి

సత్యభామ వెంటరాగ సభకు వచ్చెను
సభకువచ్చి పతినిజూచి మ్రొక్కగాను దీవించె
దపసివచ్చి నిట్లుబల్కె తాను దేవితో
భూదేవి ఆకాశవాణి మొదలు యెల్లవారు
చూచుచుండ పతినినాకు దానమిచ్చెను
తిరిగిపతిని కోరితేను నతనియెత్తు కనకమిస్తె
పుచ్చుకొనగవస్తి ననుచుబల్కినాడను
అపుడు సత్యభామ వెళ్ళి యింటనున్న ధనముదెచ్చె
తూగడాయె కృష్ణమూర్తి చోద్యమాయెను
యిరుగుపొరుగు సొమ్ములెల్ల వేగదెచ్చె సత్యభామ
తూగడాయె కృష్ణమూర్తి చోద్యమాయెను
అపుడుభామ రుక్మిణీదేవి వారిసొమ్ములన్ని
పంచివేసి చూచెనచట నొకటి లేకను
తానుదెచ్చియున్నట్టి తులసిదళము వేయగాను
మొగ్గసాగె నంతతపసి చేర వచ్చియూ
హరిసమానమైనతులసి నాకుముట్టెననుచు వేగ
శిరమునందునుంచి నృత్యమపుడు జేసెను
సురులు వచ్చి ఆకాశమందు చేరి పూలవాన
కలుగచేసినారు చూడ కృష్ణుమీదను
నృత్యగానమూలుజేసి వైకుంఠమార్గమూన
నడువసాగె నారదుండు వేడ్కమీరగను
కృష్ణమూర్తి రుక్మిణితో మందిరంబుచేరినాడు
సత్యభామ కనులయందు నీరుగుప్పుచూ
చెలులజూచి మందిరంబుజేరియుండె సిగ్గుచేత
జనులజూడ మనసురాక ఖేతిజెందియూ
తులసిదళము మహిమ యెవరు శ్రద్ధగాను చదివినను
విన్నవారికైన మోక్షమున్నదాయెను
స్త్రీలకొరకు పాటగాను జేసి కృష్ణమూర్తికి
సమర్పితంబు జేయగోరి వ్రాసినాడనూ
తకిట తకిట తకిట తకిట.